# భాషా సంకర భామామణి

మదన్‌మోహన్ మాధవి మొగుడు. పాపం ఇతను కేవలం నామ మాత్రంగానే మొగుడు! ఇతనికి "టాక్ టైమ్" లేదు! ఎవరైనా వీళ్ళ యింటికి వచ్చి ముఖ్యమైన విషయం మాట్లాడుతూంటే కూడా, మధ్యలో మదన్ మాట్లాడటానికి వీల్లేదు. ఒకవేళ, పొరపాటున ఇతడు మాట్లాడినా, "ఆవిడ మాట్లాడుతున్నారు కదండీ, మీరు ఊరుకోండి! మీ ఇంట్లో మీకు "టాక్‌టైమ్" లేదని మాకు తెలుసు!" అంటారు, ఆ వచ్చిన వాళ్ళు.

ఇంట్లో "టాక్‌టైమ్" లేక, తను పడుతున్న కష్టాలు, ఆఫీస్‌లో తన మిత్రులకి చెప్పాడు. "పెళ్ళయిన తర్వాత, మగాళ్ళకి, "టాక్‌టైమ్" ఉండదని చెప్పారు, వాళ్ళు, అసలు ఈ టాక్‌టైమ్ సంపాదించాలంటే, భర్త అనబడే మగధీరుడు, ఏంచెయ్యాలన్న విషయం గురించి కూలంకషంగా ఆఫీస్‌లో చర్చించారు. ఈ చర్చ జరుగుతోందని తెలిసిన వీళ్ళ ఆఫీసర్, "ఇంట్లో మీకు లేని టాక్‌టైమ్ గురించి ఆఫీస్‌లో మాట్లాడుకుని, ఆఫీస్ పనులు పాడు చెయ్యకండి! అయినా నాకు కూడా యింట్లో "టాక్‌టైమ్" లేదు! అందుకనే మా ఆవిడ నిద్రపోయినప్పుడు, నాలో నేనే మెల్లిగా మాట్లాడుకుంటూ, వచ్చే జన్మకైనా ఓ "మూగమనోహర ముగ్ధని" భార్యగా ప్రసాదించమని రాత్రి చాలాసేపు దేవుడ్ని ప్రార్థిస్తూ పడుకుంటుంటాను. మనం "మగధీరులం" ఎలాగూ కాదు, కనీసం మొన్న, కొత్తగా విడుదలైన "మగధీర" సినిమాచూసి, సంతోషిద్దాం అన్నాడు, ఆఫీసర్, "ఒక జన్మలో అనుభవించలేని సుఖాన్ని, ఆ దేవుడు మరుసటి జన్మలో యిస్తాడంటారు. వచ్చే జన్మకైనా మనందరం అంతులేని "టాక్‌టైమ్" అనుభవిస్తాం సార్!" అన్నారు స్టాఫ్.

స్టాఫ్ అందరూ బాగా ఆలోచించి, తలో "మొబైల్ ఫోన్" కొనుక్కోవడానికి నిర్ణయించారు. ప్రతీవాళ్ళ చేతిలో ఓ మొబైల్ చూసిన ఆఫీసర్, "మొత్తం మీద మీరు చాలా తెలివైన వాళ్ళయ్యా! జీవిత భాగస్వామి ఇవ్వని టాక్‌టైమ్, ఓ మొబైల్ ద్వారా సంపాదించారు. "మరేమనుకున్నారు సార్! ఓ మంచి అయిడియా జీవితాన్నే మార్చేస్తుంది!" అన్నారు స్టాఫ్.

తన భర్త చేతిలో మొబైల్ చూసిన మాధవి, "డబ్బిచ్చి కొనుకున్నదీ, "ఓ టాక్‌టైమేనా!" మొబైల్‌లో టాక్‌టైమ్ ఉందికదా, అని స్వతంత్రంగా ఎక్కువగా టాక్ చేస్తే లకీమని, ఆ మొబైల్ లాక్కుని మీనోరు నొక్కేస్తాను, జాగ్రత్త!" అంది.

"టాక్ చెయ్యడం" వంటి సంకర ప్రయోగాలు చెయ్యకే నేను వినలేక పోతున్నాను!"

"నేను చదువుకునే రోజుల్నుంచీ నా అభిప్రాయాలు ఒకే భాషలో వ్యక్తపరచను. ఒకేభాష మాట్లాడితే భాషా దురభిమానం అంటారు. క్లాసులో ఓసారి మా లెక్కల మాస్టార్ని ఓ లెక్క చేసేటప్పుడు "అదికాదండీ! ఫిఫ్టీ రుపీస్ టేక్ చేసుకుంటే మరెలా!" అని అడిగాను. పాపం! వెంటనే "నువ్వన్నది నా కర్థం కాలేదు, మళ్ళీ చెప్పమని" అడిగారు, ఆయన. గురువుని బాధపెట్టడం ధర్మం కాదని, వెంటనే "మరి యిదే లెక్కలో ఏభై రూపాయలు తీసుకుంటే, ఎలా అని" అర్థమయ్యేటట్లు అడిగాను. ఆయన, ఓ వెర్రినవ్వు నవ్వి, నేనడిగిన దానికి తెలియ చెప్పారు."

"ఓహో! అయితే కొంత ఇంగ్లీషూ, కొంత తెలుగు కలిపి మాట్లాడే జబ్బు, నీకు చిన్నప్పట్నుంచీ ఉందన్నమాట" అని, స్వగతంగా అనుకున్నాడు మదన్. పైకి అంటే, కొత్తగా మొబైల్ ద్వారా వచ్చిన టాక్‌టైమ్ పోతుందేమోనని!

మాధవి, ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగంచేస్తోంది. ఓసారి, తనకి సాలుసరి యింక్రిమెంట్, అయిదు వందలే యిచ్చారు! మాధవితో పనిచేసే యింకొక ఉద్యోగస్థురాలికి రెండువేలు యింక్రిమెంట్ యిచ్చారు. మండెక్కిన మాధవి తన మేనేజర్ని కలిసి "ఏమిటి సార్! ఈ అన్యాయం! అని అడిగింది. మేనేజర్ చండశాసనుడు. ఓ నవ్వు నవ్వాడు. ఆ దరహాసం చూసిన మాధవి, "ఏమిటిసార్! నవ్వుతారు!" అంది.

"ఏమిటమ్మా! నీకు చెప్పవలసిన అవసరం లేదు" అన్నాడు.

మాధవి కోపంతో ఊగిపోయింది! "ఇంకొక్కమాట "టాక్‌చేస్తే" చంపేస్తాను" అంది.

"నేనేం నీ మొగుడ్ని కాను! టాక్ చేస్తే చంపెయ్యడానికి! బోల్డు ఆఫీస్ పని ఉంది నాకు! నాకు "టాక్ టైమ్" లేదు! గెటవుట్ అన్నాడు. మేనేజర్ తన వాక్ స్వాతంత్ర్యాన్ని నాశనం చేసిన తన భార్యని తలచుకుంటూ.

"ఓహో! వీళ్ళావిడ కూడా, ఈయనికి యింట్లో టాక్‌టైమ్ లేకుండా చేసింది కాబోలు! ఆ కోపం ఆఫీస్‌లో మహిళా ఉద్యోగస్తుల మీద ప్రదర్శిస్తున్నాడు, నీచమానవుడు' అనుకుంది మాధవి.

అసలు, తర్వాత బయటపడిన విషయమేమంటే, మాధవి కూడా తన భర్తకి టాక్‌టైమ్ లేకుండా చేసిందన్న విషయం మేనేజర్‌కి తెలిసి, ఆమెకి మంచి యింక్రిమెంట్

యివ్వకుండా అవమానపరిచాడట. భర్తని ఉసురుపెడితే, మరి యిలాగే అవుతుంది!

అవమాన భారంతో, ఉద్యోగం మానేసిన మాధవి, తన భర్త చేత ఆఫీస్‌కి ఓ పదిరోజులు సెలవు పెట్టించి, తన పుట్టింటికి తీసుకెళ్ళింది. రైలెక్కగానే బాధగా నిద్రపోయింది మాధవి.

ఈ మధ్యనే మదన్ వేయించుకున్న "టాప్‌అప్" కార్డులో, యిరవైశాతం అదనపు టాక్‌టైమ్ వచ్చింది. పైగా, రాత్రి పదకొండు గంటల నుండి ఉదయం ఎనిమిది గంటల వరకూ నిమిషానికి పది పైసలే ఖర్చు, "అబ్బ! ఏమని వర్ణింతు, ఈ మదనుని టాక్‌టైమ్ భాగ్యము" అని, మొబైల్ ద్వారా తనకి వచ్చిన "వాక్‌స్వాతంత్ర్యాన్ని", తనివి తీరా అనుభవించాడు.

పక్క బెర్త్‌మీద పడుకుని, మదనుని మాటలు వింటూన్న సహ ప్రయాణీకుడు, "ఏం సార్ "హేపీ అవర్స్" వల్ల వచ్చిన ఫెసిలిటీ బాగానే వాడుకుంటున్నారే!" అన్నాడు.

మొబైల్‌తో, హేపీ అవర్స్‌లో మునిగిపోయిన మదన్‌కి ఈ మాటలు వినిపించలేదు!

తెల్లారింది! మాధవి లేచి, మదన్‌కి టూత్ బ్రెష్ యిచ్చింది. ఇంతలో ఒకడు మదన్‌తో "అబ్బ రాత్రి తెల్లవార్లూ మొబైల్‌లో మాట్లాడుతూనే ఉన్నారే!" బోల్డు "టాక్‌టైమ్ గోవిందా అయిపోయి ఉంటుంది" అన్నాడు.

"మా పుట్టింటికి నడవండి మీ పని చెప్తాను!" అనుకుంది మాధవి.

"నాకు మొన్నమొన్ననే టాక్‌టైమ్ వచ్చింది! టాక్‌టైమ్ గోవిందా అయిపోయి ఉంటుంది, అంటాడేమిటి వీడు, అనుకుని, బ్రెష్ పట్టుకుని తొందర, తొందరగా వాష్ బేసిన్ దగ్గరికి వెళ్ళాడు. రైలు గమ్యం చేరింది!

మాధవిని చూసిన ఆమె తల్లి, "ఏమిటే అలా చిక్కిపోయావ్?" అంది.

"ఉద్యోగం మానేశాను"

"ఉద్యోగం మానేస్తే, ఒళ్ళు చెయ్యాలి కాని చిక్కిపోవడం ఏమిటే" అంది తల్లి.

జరిగిన విషయాలు వివరించింది మాధవి.

"ఎవర్నో ఉసురుపెట్టి ఉంటావ్!" అంది తల్లి. ఆ రాత్రి తెల్లవార్లూ నిద్రపట్టక ఆలోచిస్తూ పడుకుంది మాధవి.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?" అని అడిగాడు! మదన్. బాబూ! కాసేపు టాక్ చెయ్యకుండా నోర్మూసుకుని పడుకోండి!" అంటూన్న మాధవికి, "ఓహో! ఈయనికి అసలు టాక్టైమ్ లేకుండా చెయ్యడం వలననే, ఈయన ఉసురు తగిలి, నేను ఉద్యోగం మానేసుంటాను" అని స్ఫురించింది.

"అరె సారీ మదన్! ఏదైనా ఎంతసేపైనా మాట్లాడండి! ఈ రాత్రంతా పూర్తిగా టాక్ చేసుకోండి! మీకు "ఫుల్టాక్టైమ్ గ్రాంటెడ్" అంది మాధవి.

"ఫూల్ టాక్ టైమ్ కాదే, ఫూల్! ఫుల్ టాక్టైమ్ అన్నాడు" ఇదే మంచి సమయము మించినన్ దొరకదు!" అనుకున్న మదన్.

"ఆ మాత్రం మాకూ తెలుసండీ! "ఫుల్"కి దీర్ఘం పెడితే "సుదీర్ఘమైన టాక్టైమ్" అనే అర్థం వస్తుందని, అలా అన్నాను. పెళ్ళయి ఎన్ని సంవత్సరాలైనా, పెళ్ళాన్ని సహృదయంతో అర్థం చేసుకోదు మీ మగజాతి!

"ఔను! నిజమేనే! భాషా సంకర భామామణీ!" అన్నాడు మదన్.

---

రంజని(ఉగాది 2011)